
# ముగింపు

*నలుగురిలో ఉండవలసిన వాడికి నమ్మిక ముఖ్యం. నమ్మి చెడవచ్చు. కాని, నమ్మిక బాగుపడడం సాధ్యం కాదు. అందులోనూ స్నేహితుడైన వాడు ఒక మాట అంటే కాదనుకోనడం ఎలాగు?*



**ఇసుకపల్లి దక్షిణామూర్తి**

**పచ్చని** నులివెచ్చని ఎండ.

పొడుగాటి నీడలు రోడ్డుకడ్డంగా పరుచుకున్నాయి. పబ్లికు గార్డెన్సులోనుంచి వచ్చేగాలి ధ్వనిచేస్తుంటే విశ్వవీణ శ్రుతి చేస్తున్నట్లుంది. సాయంసమయంలో సముద్రపు హోరులా ఉంది. గోపాలం బస్సుస్టాండు దగ్గర నిలబడ్డాడు. పార్వతికూడా అక్కడే ఉంది. గాలి వీస్తే ఆమె చీరెకొంగు అతనికి తగిలేటంత సమీపంలో ఉన్నారు. మరుక్షణంలో ఎంతో దూరం. పిలుపు వినబడనంత దూరం.

ఎండుటాకులు రోడ్డుమీద గమ్యంలేకుండా పరుగెత్తుతున్నాయి. వారి ఆలోచనలు వాటి వెంట తిరుగుతున్నాయి.

గోపాలం చేతిలోని శుభలేఖల కట్టనుండి వచ్చే పరిమళం పార్వతి ఆస్వాదించలేకపోతున్నది. ముఖం ఎటో తిప్పి చూస్తున్నది. పక్కకు తిరిగినప్పుడు పార్వతి మరింత అందంగా కనిపిస్తుంది. షిఫాను చీరె రెపరెపలాడుతూ ఒంటిమీదనుంచి జారిపోతుంటే వయ్యారంగా మీదకు సర్దుకున్నప్పుడు ప్రకృతి రమణీయమైనదే అనిపిస్తుంది. వెడల్పైన పెదిమలైనా తీర్చిదిద్దినట్లున్నాయి. ముఖం కోలగా.....చిరునవ్వు తాకిడికి చెక్కిళ్ళు గుంటపడేలా....గాలి గట్టిగా వీస్తే కందిపోయే లేత అరిటాకులాంటి చర్మం...గోపాలం పార్వతిని చూస్తుంటే తప్పు చేసినవాడిలా బాధపడ్డాడు. శు భ లే ఖ వం క చూశాడు. అందులో ఇందిర కనిపించింది. పారాణి కనిపించింది. నవ్వుకున్నాడు. బురదలో నుంచి వచ్చిన తామరపువ్వు రెక్కలా తెల్లగా ఉంది ఆ నవ్వు.

ఆ రోజు...సరిగ్గా గంటకింద కలిసినప్పుడు "ఈ మధ్య బొత్తిగా కనబడటంలేదే మీరు..." అని అడిగింది. సమాధానంగా శుభలేఖ తీసి చూపించాడు. ఆమె శుభలేఖ అందుకుంది. వెంటనే ముఖంమీదకు నల్లనినీడ — చంద్రుడిమీదకు మబ్బులా — వచ్చింది. ఆమె చేతులు కంపించినాయి. పెదిమలు తడబడినాయి. అతని వంక సూటిగా చూసింది. తను ఆ చూపులు భరించలేకపోయాడు.

'నువ్వు దగాకోరువి.... మోసగాడివి... ఇంకా....ఇంకా....ఆ చూపులు అరుస్తున్నాయి.

"నేను ఊళ్లో లేను...అందువల్ల రిహార్సల్సుకు రావటం పడలేదు." పార్వతి అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పాడు. ఆమె వినిపించుకోకుండా కుర్చీలోంచి రాకెట్టులా లేచి లోపలకు వెళ్లిపోయింది. తనింకా ఏవో మాట్లాడాలనుకున్నాడు...నాటకాల గురించీ... నటకులగురించీ. పక్కన ఎవరో ఒకరిద్దరు ఆమె ప్రవర్తనకు విస్తుపోయారు. లోపలకు పోయిన పార్వతి ఎంతకూ తిరిగి రాలేదు.

"ఎప్పుడు రోయి...రావటం?" రామారావు వచ్చి పక్కనే సోఫాలో కూలబడ్డాడు. "ఇక్కడనుంచి వచ్చింది...ఏడుస్తూ కూర్చుంది పార్వతి.

ఏమయిందిరా... ఇక నాటకాల్లో వేషం వేయ నంటోంది..." అన్నాడు.

"నిజంగా....?!"

"అసలు ఏం జరిగిందిరా.... రేపు రాత్రికి నాటకం ఆడాలి నేను..."

గోపాలం శుభలేఖలు అతనికి కనపడకుండా సంచీలో దాచేశాడు.

"సత్తాలేవు... ఎక్కడినుంచి ఊడిపడ్డావు.. ఏమిటీ....మీ ఊరికి ఇచ్చిన టెలిగ్రాములు అందాయా..." అతని మాటలన్నీ గోడలకు తగిలి విరిగి కింద పడుతున్నాయి.

"ఇప్పటికే టిక్కెట్లు అమ్మటంగూడా అయిపోయింది... హఠాత్తుగా పార్వతి వేషం వేయటం మానేస్తే మన గౌరవం మంట కలిసిపోతుంది..." రామారావు ఆందోళన పడు తున్నాడు.

గోపాలం ఆ మాటలేవీ వినిపించుకునేటట్లుగా లేడు. బయటకు వచ్చేశాడు. బస్సుస్టాండు దగ్గర నిలబడ్డాడు. పార్వతిని దగా చేశాడా తను? ఆమె చూపులు అతని హృదయాన్ని బలంగా గాయపరిచినాయి.

పార్వతి బస్సుస్టాండుదగ్గరకు వచ్చి గోపాలం అప్పటిదాకా అక్కడే ఉండటం చూసి తెల్ల బోయి, వెంటనే సర్దుకుని, మెదలకుండా నిలబడింది.

"మీరు నాటకంలో ఉండనన్నారుట..." గోపాలం మెల్లిగా అన్నాడు. ఆమె సమాధానం చెప్పలేదు. కంటివెంట నీరు సెలయేరులా జలజలా రాలి చెక్కిళ్లమీదుగా వక్షస్థలంమీదకు జారింది. తిరిగి పలకరించలేకపోయాడు. గాలికి చిరకొంగు తాకేదూరంలో నిలబడ్డా వారిద్దరి మధ్య భూమికి, చంద్రుడికి మధ్యఉన్న దూరం ఏర్పడింది. అఖాతం అది.

ఆమె /బస్సు/ ఎక్కింది. పది అడుగులు ముందుకు సాగిందో, లేదో, పార్వతి కిటికీదగ్గ రకు వచ్చి కూర్చోవటం...చేతిలోనుంచి శుభలేఖ జారి పడిపోవటం కనిపించింది. పరుగున వెళ్లి శుభలేఖ తీసుకున్నాడు. పైకవరుమీద 'శ్రీమతి పార్వతిగారికి...' అని తను వ్రాసిన అక్షరాలు వెక్కిరిస్తూ కనబడ్డాయి. కవరు చించేసి శుభ లేఖ బొత్తిలో పెట్టాడు.

పార్వతి కంటిధారలో కొట్టుకుపోతున్నాడు తను. ఎవరిదగ్గరకూ పోదామనిపించలేదు. బస్సుస్టాండులో కమ్మీలకు ఆనుకుని నిల బడ్డాడు. బస్సు వచ్చింది. తను ఎక్కుదామను కున్న బస్సులోనుంచి నరసింహారావు దిగాడు. "హల్లో..." అన్నాడు. నవ్వటానికి ప్రయత్నం చేసి ఓడిపోయాడు గోపాలం.

"అరె పిడుగా...పెళ్లి శుభలేఖలు... నీదేనా పెళ్లి...నిర్ణయానికి రావటానికి ఇంత టైం పట్టిందన్నమాట...పార్వతిని పెళ్లికూతురు లాగా చూడాలన్న నా చిరకాల వాంఛ..." నర సింహారావు వాగ్ధాటి గోపాలం చూపుల కట్ట దగ్గర ఆగిపోయింది. మళ్లీ తమాయించుకుని "ఏమయిందిరా అట్లా ఉన్నావు? అంతా బాగున్నారుకదా..." అన్నాడు. శుభలేఖతీసి చది వాడు. పార్వతి పేరు బదులు ఇందిర పేరు కన బడటంతో నిస్తుపోయాడు. "ఇందిర ఎవర్రా... పార్వతితో వ్యవహారం బెడిసిందా....?"

గోపాలం నిట్టూర్చాడు.

"నీ మనస్సు బాగాలేదు...కొంచెం కాఫీ తాగివద్దాం పద..." అన్నాడు నరసింహారావు. ఇద్దరూ బయలుదేరారు.

నరసింహారావు పార్వతిని పరిచయంచేసి నాలుగేళ్ళు అవుతున్నది. బి. ఎ. పాసయి ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నది. తలిదండ్రులు కలవాళ్లు. ఆమెకు నచ్చిన సంబంధం తీసుకుని వచ్చి గార్హస్థ్యాశ్రమంలోకి ప్రవేశపెట్టాలని ఎంతగానో ప్రయత్నించారు. ఆమె నేటికీ అంగీకరించలేదు. తను భర్తగా ఎన్నుకునే వ్యక్తిలో కొన్ని గుణాలు కోరుకుంది. ఆమె ఊహలో భర్త రూపం పొందాడు. అటువంటి వాడికోసం అన్వేషించింది. పిరికిపందలు, నిరాశా వాదులు, పుస్తకాల పురుగులు...పరిచయం అయ్యారు. ఆమెను ప్రసన్నం చేసుకోవటానికి ప్రయత్నం చేసేవాళ్లను చూస్తే అరికాలి మంట నెత్తికి ఎక్కేది. తను చెప్పిన మాట వినే భర్త కావాలన్నది ఆమె కోరికల జాబితాలో లేదు.

జాకెట్టు మెడ కత్తిరింపులో మెడ ఎము కలు పైకి తేలి కనబడుతూ, వాటికి హారంలా పులిగోరు వేళ్లాడుతుంటే పిచ్చివాళ్లయి ఆమె వెంట ఎంతమంది తిరిగారో లెక్కలేదు. ఆమెతో మాట్లాడటానికి అంతా అన్నిరకాల అవకాశాలూ కల్పించుకునేవారు. వాళ్లను చూస్తే చీదరింపు! అసహ్యం! బిచ్చగాళ్ల వాళ్లు. తన ప్రేమభిక్ష కోసం పడిగాపులు కాచేవాళ్లు తనకు అక్కర లేదు. తనే అడగదగ్గ మనిషికోసం అన్వేషణ జరుపుతున్నది. అందులోనే ఆమె వయసు జీర్ణించిపోతున్నది. తీయని కోర్కెల సఫలతలో తన్మయం పొందవలసిన వయసులో అభిసారిక వలె ప్రియుని అన్వేషణలోనే సమయం వెచ్చి స్తున్నది.

పార్వతిని మొదటిసారిగా నరసింహారావు పరిచయం చేసి "పార్వతి బి. ఎ., నర్తకి, నటి, ఇంకా...ఇంకా..." ఎన్నో చెప్పాడు. గోపాలం అన్నీ విని "ఓహో...." అన్నాడు. ఆమెను సరిగా చూడలేదు. కళ్లల్లోకి చూశాడు నిర్ల క్ష్యంగా. "మళ్లీ నాకు పని ఉంది వస్తారా..." అన్నాడు. పార్వతి చురచుర చూసింది. తన అందచందాలను నిర్లక్ష్యంగా చూడటం అవమా నంగా భావించింది. పరిచయం అయినవాళ్లు తమనుగురించి చెప్పి చెప్పి విసిగించేవాళ్లు. ఆ సమయంలో వారి చూపులు తనను ఆమూలా గ్రంగా కబళించివేయడం గమనించేది. కొందరు మరీ ముందుకు వంగి మాట్లాడబోతే "అలా కూర్చోండి..." అని చెప్పిన సందర్భాలు గూడా లేకపోలేదు. పార్వతి, నరసింహారావుతో సంభాషణ త్రుంచేసి ఇంటికి వెళ్లిపోయింది.

గోపాలం నాటకం ట్రూపులో కలిశాడు. నిండైన విగ్రహం కాదుగాని భావాలు ప్రద ర్శించటంలో విశేషమైన నేర్పుంది అతనికి. విడిగా కలిసినప్పుడు అంత గొప్ప నటనాకౌశలం కలవాడని ఎవ్వరూ అనుకోరు. మామూలు మనిషిగా కనపడే గోపాలం రంగస్థలంమీదకు రాగానే మారిపోతాడు. అతని స్వరం సప్తస్వరా ల్లోనూ పలుకుతుంది. అతి సాధారణమైన వాచికంలో ఎవరికీ కనబడని భావాలను, ఉద్రేకా లను ప్రతిఫలింపచేస్తాడు.

మొట్టమొదటి నాటకంలో గోపాలం దొంగ వేషం వేశాడు. భర్త ఊళ్లో లేనప్పుడు భార్యను బలాత్కారంగా లాక్కుపోతాడు....డబ్బు ఇస్తే వదిలిపెడతామని భయపెట్టటం కథ....రిహా ర్సలు జరగటంలో ఇబ్బందేమీ కాలేదు. ఎప్పుడూ ఆలస్యంగావచ్చి అధికారం చెలాయించే పార్వతి



ఏడ్వనిండు !

చిత్రం—ఎమ్. శంకరరావు (అనకాపల్లి)

రెండు నిమిషాలు ముందుగానే వస్తూవచ్చింది.

నాటకంరోజు రంగస్థలంమీద గోపాలం, పార్వతి నోరుమూసి లాక్కుపోవాలి. తీవ్రంగా ముందుకు వచ్చినపుడు, పార్వతి వెటకారంగా సమాధానం చెప్పాలి. సంభాషణ మరిచిపోయింది. వెనకాల మాటలు అందించేవాళ్లు ఎన్నిసార్లు అన్నా ఆమె వినిపించుకోలేదు. గోపాలం వేషం చూసి పిచ్చిదైపోయింది. అతనివంకనే చూస్తూ రెండడుగులు ముందుకు వేసింది. అతనికి ఏం చెయ్యటానికీ తోచలేదు. "తప్పించుకుని పారి పోదామని చూస్తున్నావా...జాగ్రత్త..." అంటూ హుంకరించి ఆమె చెయ్యి పట్టుకున్నాడు. ఆమె విదిలించుకోలేదు. నిశ్చేష్టురాలైంది. ఆమెలోని అణువు అణువూ చైతన్యంతో తొణికిసలాడి పరవశం పొందింది. పార్వతి అతని వెంట నడి చింది నిశ్చలంగా — బొమ్మలాగా. తెరపడింది. అంతా చప్పట్లుకొట్టారు. పార్వతి నటన బాగా లేదనిగాని, సంభాషణ మరిచిపోయా

రెందుకు అని గాని అనటానికి ఎవరికీ ధైర్యం లేదు. ప్రాంప్టింగు చెప్పేనవాడు వచ్చి దీనంగా నిలబడ్డాడు.

గోపాలం "మీరు ఇంత గొప్ప నటీమణులని తెలియదు" అన్నాడు. పార్వతి తల వంచుకుని నిలబడింది.

"మీరు నాటకాలు వదిలిపెట్టి శుభ్రంగా పెళ్లిచేసుకుంటే మంచిది..." అన్నాడు. పార్వతి దిగ్గున తల ఎత్తింది. గోపాలం గ్రీన్‌రూంలోకి వెళ్లిపోయాడు. పార్వతి "హా" అని హుంకరించింది.

"వాడికి మర్యాద తెలీదు.." అన్నాడు నరసింహారావు.

తరువాతి రంగంలో పార్వతి దొంగలము-లో చేరిన సీను. గోపాలం వచ్చేటప్పటికి పార్వతి కంగారుగా లేచి నిలబడాలి. అట్లాగే కూర్చుంది.

"అయ్...అంత అహంకారమా..." అంటూ గోపాలం ఆమెను చేత్తో పట్టుకుని నిలబెట్టాడు. పార్వతి చెయ్యి నలిగి ఎరుపెక్కింది. విపరీతమైన బాధ కలిగింది. ఎదురుగా వందలాది ప్రేక్షకులున్నారు. అతనితో కలియబడింది. చేతికొద్దీ కొట్టబోయింది. ఎడంచేత్తో ఆమె చేయి పట్టుకుని "దీన్ని కట్టేయ్యండి...." అన్నాడు. ప్రేక్షకులు తన్మయులయ్యారు. "గొప్ప నటన..." అన్నారు. పార్వతి, గోపాలానికి ఎదురుతిరగటం ఇంత ఉద్రేకంగా ఎప్పుడూ చెయ్యలేదన్నారు.

"మీరు రెండో రంగంలో చేసిన నటన చాలా బాగున్నది..." అన్నాడు పార్వతితో గోపాలం.

"అది నటన కాదు..." అంది మండిపడుతూ.

"లేకపోతే నాతో గెలవగలనని అనుకున్నారా?" అన్నాడు గోపాలం నవ్వుతూ.

పార్వతి మర్నాడు ఆఫీసులో సరిగ్గా పని చెయ్యలేదు. హాజరుపట్టీలో సంతకం పెట్టటం మరిచిపోయింది. కాగితాలన్నీ ముందు వేసుకుని అలాగే కూర్చుంది. "ఒంట్లో బాగాలేదా..." అంటూ పరామర్శించటానికి వచ్చినవాళ్లకు సమాధానం సరిగ్గా చెప్పలేదు. ఆరుసార్లు కాఫీ తాగింది. మధ్యాహ్నం స్నేహితురాళ్లతో చెట్టు కింద నిలబడి చింతపూలనూ, ఉడతలనూ చూస్తూ పరధ్యానంగా గడిపింది.

"ఏమిటే...అట్లా ఉన్నావు..." అని అడిగితే "ఎట్లా ఉన్నాను?" అని ఎదురు ప్రశ్న వేసింది.

హఠాత్తుగా గోపాలం వచ్చాడు. అటూ ఇటూ చూశాడు. చెట్టుకింద వీళ్లంతా నిలబడి ఉన్నారు. "ఇట్లారండి ఒకసారి..." అన్నాడు గోపాలం, పార్వతిని వేలుపెట్టి చూపిస్తూ. పార్వతికి ఉక్రోషం వచ్చింది. "ఏమిటి....ఆ అధికారం...ఎవరిని ఆ పిలుపు...?!" చుట్టూ స్నేహితురాళ్లు సాలోచనగా ఊరుకున్నారు.

"ఈ రాత్రికి మనం నాటకం వెయ్యాలి...

## ముగింపు

మీరు ఆఫీసు కాగానే గదికి రండి..." అని చెప్పి వెళ్లిపోయాడు. పార్వతి అతను వెళ్లినవైపే చూస్తూ నిలబడింది.

ఆనాటి నాటకంలో గోపాలం నాయకుడు. "నీ కోసమే నేను బ్రతికి ఉన్నాను..." అంటాడు. "నేనూ...అంతే..." అందామనుకుంది. నోట మాట రాలేదు. అతని కౌగిలిలో ఒదిగిపోయింది.

"ఇంత స్వేచ్ఛగా నటించడం తప్పు..." అన్నారు కొందరు.

"నటనకు అవధుల్లేవు...ఆమె నటన పరిణతి చెందుతోంది..." అన్నారు కొందరు.

"నిజంగా భార్యాభర్తలా..." అని అడిగాడు ఒకడు.

"అయితే అంత బాగా చెయ్యలేరు...." అన్నాడు ఇంకొకడు.

నాటకం అయిన తర్వాత "మీరు బాగా పాడతారట..." అంది పార్వతి.

"వినగలిగే అదృష్టం అందరికీ ఉండద్దూ" అన్నాడు గోపాలం.

'అవును...అవును...' పార్వతి తనలో తాను అనుకుంటూ రంగు కడుక్కోవటానికి వెళ్లిపోయింది.

గోపాలం ఉత్తమ నటుడు! పార్వతి ఉత్తమ నటి!! ఎక్కడ చూసినా ఇదే మాట. ఒకే నాటకం రోజూ వరుసగా ఆడిన సందర్భాలుగూడా ఉన్నాయి. పార్వతిని ఉద్యోగం మానేసి నాటకకళకే కృషి చేయమని చాలా మంది సలహాలిచ్చారు. అందరి మాటలూ విని ఊరుకుంది పార్వతి....

గోపాలానికి జరిగిన సంగతులన్నీ తళుక్కున మెరిశాయి. పార్వతి ఒకరోజు నాటకంలో తన చెల్లెలుగా వేషం వెయ్యవలసివచ్చినరోజు జ్వరం వచ్చిందని చెప్పి ఇంటివగ్గరే పడుకుంది. గోపాలం చూడటానికి వెళ్లలేదు....

నరసింహారావు గడ్డిపోచలు పంటికింద ఆడిస్తున్నాడు. "అట్లాగయితే పార్వతి నీగురించి పలవరించటం...నిన్నే పెళ్లి చేసుకుంటానని స్నేహితురాళ్లందరితో చెప్పటం నీకేం తెలియదా..." అన్నాడు నరసింహారావు.

"నాకేం తెలియదు...ఆ సంగతులన్నీ ఇప్పుడు అర్థం అవుతున్నాయి. పార్వతిని అర్థం చేసుకోలేకపోయాను...."

"చదువుకున్నవాడివి ... నటుడివి ... ఈ మాత్రం గ్రహించుకోలేకపోతే ఆమె నెందుకు ఉత్తేజపరిచావు...ఆమె జీవితంలో ఎందుకు తొంగిచూశావు...?"

"సరదాగల మనిషిగదా... అని నేనూ సరదాగా ఉందామనుకున్నాను...."

"సరదానా...? జీవితంతో చెలగాటాలాడటం సరదానా నీకు... నీ నటన రంగస్థలందాటి జీవనరంగంమీదకు గూడా విస్తృతం చేసుకున్నావా... ఛీ...ఛీ... ఎంత పని చేశావు...పార్వతి మనసు ఎంత సున్నితమైనదో తెలుసా...ఈ వివాహం జరగటంలేదని తెలిసి నేనే విహ్వలుడనయ్యాను.... ఇంతకీ ఆ ఇందిర ఎవరు...?"

గోపాలం తల వంచుకునే సమాధానం చెప్పాడు: "నేనూ మొన్ననే చూశాను..."

"చదువుకుందా? అందమైనదా?"

"ఏదీకాదు..."

"అయితే పార్వతిని కాదని ఇందిరను ఎందుకెన్నుకున్నావు...?"

"పార్వతిని వివాహం చేసుకుందామని ఊహలోనైనా కలగలేదు...నటిగానే చూశాను."

"నటిగా చూశావా...వెంటేసుకుని సినిమాలకు, షికార్లకు తిరగటం తెలీదనుకున్నావా... అదంతాగూడా నటనేనా?"

"అదికాదు నరసింహారావు...మా కులం గూడా కాదు పార్వతి..."

"రంగస్థలంమీద కౌగిట్లోకి తీసుకోవటానికి...రిక్షాల్లో పెచ్చుగా కూర్చోవటానికి కావలసివచ్చింది గాని...జీవితం నీతోపాటు పంచుకోవటానికి కులం అడ్డువచ్చిందా? నువ్వు స్నేహితుడవని చెప్పుకోవటానికి ఇంతవరకు ఎంత గర్వపడ్డానో...ఇప్పుడు అంత సిగ్గుపడేట్లు చేశావు...!"

గోపాలం, నరసింహారావు చేతులు పట్టుకున్నాడు.

"నన్ను చిత్రవధ చెయ్యక...నువ్వేం చెయ్యమంటే అది చేస్తానిప్పుడు."

"ఇప్పుడేమిటి చేసేది...చేతులు కాలిన తర్వాత...పార్వతి నిన్ను తలుచుకుని ఎన్ని ఆశాసౌధాలు నిర్మించుకుంది..."

"ఈ శుభలేఖ చూడగానే ఆమె ముఖం నల్లబడిపోయినప్పుడే నాకు ఇదంతా అర్థమయి

(తరువాయి 54 వ పేజీలో)



మిథునం

చిత్రం వి. ఎస్. శాస్త్రి (పిరాం)

నట్లనిపించింది.."

"పార్వతి ఏదయినా అఘాయిత్యానికి దిగితే దానికి బాధ్యత ఎవరు తీసుకుంటారు...?"

"నేనే...ఆ బాధ్యత తీసుకుంటాను..."

"బాధ్యత తీసుకునే మొనగాడొచ్చాడు... మహా అయితే రెండు కన్నీటిచుక్కలు రాలు స్తావు....అంతేను...నీ మొసలి కన్నీళ్లకు విలువ గూడనా...?"

"మనిషి చేసిన తప్పును దిద్దుకోవటానికి అవకాశం ఉండాలి...నావి మొసలికన్నీళ్లు కావని రుజువు చేసుకుంటాను..."

గోపాలం ఆవేశంగా లేచాడు.

ఎండ ఎక్కువయింది. రిక్షా ఎక్కి సూటిగా ఇంటికి వెళ్లిపోయాడు. శుభలేఖలన్నీ విసిరే శాడు. గదినిండా అవే! ఎక్కడచూసినా ఇందిర అందులోనుంచి కనపడుతున్నది. తల పట్టు కున్నాడు. పగిలిపోతున్నది. ముఖంమీద చిరు చెమట పట్టింది. ఇప్పుడేమిటి చెయ్యటం? ఇప్పుడేమిటి చెయ్యటం...!! పార్వతి, పార్వతీ... అదేమాట. పార్వతి తన దగ్గరకు వస్తుంటే ఇందిర మధ్య నిలబడి వెక్కిరిస్తున్నది. కళ్లు మండిపోతున్నాయి. పార్వతి ఇంటికి పోదామను

# ముగింపు

( 36 వ పేజీ తరువాయి)

కున్నాడు...ఇందిరతో పెళ్లి వద్దని టెలిగ్రాం ఇద్దామనుకున్నాడు.

గదిలో కూర్చుని కిటికీలోనుంచి బయటకు చూస్తున్నాడు. బండిచక్రాలకింద బాతులు నలిగిపోతున్నాయి. అలా ఎంతసేపు కూర్చు న్నాడో టైము గబగబా గడిచిపోయింది.

రామారావు వచ్చాడు.

"కొంప మునిగిపోయిందిరా గోపాలం..." అన్నాడు.

గోపాలం మగతలోనుంచి ఉలిక్కిపడుతూ లేచి "ఏమయింది? ఏమయింది?" అంటూ కంగారుగా అడిగాడు.

"పార్వతి బస్సుకిందపడి చనిపోయింది..."

"ఆ..." అదిరిపడ్డాడు గోపాలం. నిశ్చేష్టు డయ్యాడు.

"చూద్దాం, వస్తావా..."

"నేను రాను...నన్ను ఒంటరిగా వదిలెయ్.." గోపాలం కుప్పగా కూలిపోయాడు.

"నువ్విక్కడే ఉండు...నేను చూసివస్తా ముందర..."

రామారావు వెళ్లిపోయాడు.

ఎక్కడో సన్నాయిమేళం సన్నగా వినబడు తున్నది. చుట్టూ వెలుతురు...తనలో చీకటి. అంతా ఆనందమయం...తనలో దుఃఖం గూడుకట్టుకుంది. హుస్సేన్‌సాగర్...గండిపేట... చార్‌మినార్...అన్నిచోట్లనుంచి మృత్యువు చల్లని చేతులతో ఆహ్వానిస్తున్నది. తన కాళ్లు ఎవరో పట్టుకున్నారు. ఎవరోకాదు, ఇందిర!? తన కాలి కింద శుభలేఖ నలిగిపోతున్నది...శుభలేఖ తీసి దులి పాడు. మడిచి జేబులో పెట్టాడు...

* * *

వెంకటరావు ఆవేశంగా చదివాడు కథను. నావంక సాలోచనగా చూశాడు.

"కథ ఇంతవరకే వ్రాశాను..." అన్నాడు. "ఎట్లా ఉంది?...కథలు వ్రాయటం ఇదే మొదలు నాకు."

"కథ బాగానే ఉంది..."

"బాగుందంటే కాదు... ముగింపు ఎలా చెయ్యాలో తెలియలేదు... మీరు కథలు వ్రాస్తుం టారుగదా...చూపిద్దామని తెచ్చాను..." అన్నాడు. అతను నాతోపాటే ఉద్యోగం చేస్తున్నాడు.

"కథ ముగింపుకేముంది... అంత ఉద్రే కంలో ఉన్నాడు... ఏ హుస్సేన్‌సాగర్‌లోనో దూకి నట్లు వ్రాస్తే సరిపోతుంది..." అన్నాను.

"సరే... అట్లాగే చేస్తా..." అన్నాడు వెంకటరావు.

గడియారం తొమ్మిదిన్నర చూపిస్తున్నది.

"మళ్లీ ఆఫీసు టయిమవుతున్నది" అన్నా కుర్చీలోంచి లేస్తూ.

"సరే ... నాకూ టయిమవుతున్నది..." అంటూ వెంకటరావు వెళ్లిపోయాడు.

నేను ఆఫీసుకు వెళ్ళిపోయేటప్పటికి లేట యింది. కుర్చీలో కూర్చోగానే ముకుందం వచ్చి "కాఫీ తాగివద్దాం రారా!!" అంటూ పిలిచాడు. మెట్లుదిగి కిందకు వస్తుంటే రమణ ఎదురై "ఒరేయ్...మన వెంకటరావులేడూ...హుస్సేన్ సాగర్‌లో దూకి చచ్చిపోయాడుటరా...." అన్నాడు. నా గుండె ఒక్కసారి ఆగిపోయినట్ల యింది.

"పాపం వాడి పెళ్లిగూడా నిశ్చయమైంది.. ఈ శుభలేఖలు పంచమని నాకిచ్చాడు....ఇంత ఘోరం జరుగుతుందని అనుకోలేదు...." అన్నాడు రమణ.

నాకు కాలు చెయ్యి ఆడలేదు. వెంకటరావు వేసిన నాటకాలు, అందులో నటించిన శకుంతల తళుక్కున గుర్తుకువచ్చాయి.

"మన వెంకటరావుతోపాటు నాటకాలు వేసేది శకుంతల...ఆ అమ్మాయి ఎక్కడుంది ఇప్పుడు?" ఆదుర్దాగా అడిగాను.

"పాపం ఆ అమ్మాయి...నిన్న ఉదయం రైలుకింద పడిందిటు!..." అన్నాడు రమణ. ★

# గృహ వైద్యం

ఆహార ప్రమాణము:— పైన చెప్పినట్లు తమ తమ తృప్తి ననుసరించి కడుపులో సగము వరకు భుజించి తక్కిన పాతిక భాగము నీళ్ళు త్రాగి, మిగత పాతిక ఖాళీగ నుంచవలెను.

ఆరోగ్యంతో మనుగడ సాగించడానికి ఈ ఆహార ప్రమాణం చాలు. అంతేను. జీవించి ఉండడమే తినడానికని తలచేవారు లేరు.

ఇతర విషయాలు:— ఆహారానికి అవసా నంలో త్రాగే పానమునకు అవపానమని పేరు. భక్ష్యాదులను అనుసరించి వివిధమైన పానము కూడ అవసరమని శాస్త్రము విధిస్తున్నది.

బియ్యము, గోధుమలు, బార్లి మొదలయిన వాటితో చేసిన ఆహార పదార్థాలను భుజించిన చల్లనీళ్ళు త్రాగవలెను.

పెరుగు అన్నము మొదలయినవాటికి చల్ల నీళ్లే అనుపానము.

ఇడ్లీ, దోసె, కుడుములు, ఉప్పుపిండి మొద లగు పిండి పలహారాలకు వేడినీళ్ళు చాలమంచి అనుపానము.

శాకములు—అనగా కూరగాయలు. పెసలు, వీటిచే చేయబడిన పదార్థాలకు మజ్జిగ మంచి అనుపానము.

అతి స్థూలమైనవారు చిక్కవలెనంటే, ఒక గ్లాసు నీళ్ళలో రెండు టీ స్పూనుల తేనె కలిపి, ప్రతిపూటా భోజనానికి ముందు త్రాగుట మంచిది.

కృశులకును, క్షయరోగులకును మాంసరసం (సూపు) అనుపానంగా వాడవలెను.

చిరకాల రోగమువల్లనో, మరి వేరు కారణము వల్లనో శరీరము చిక్కిపోయినవారికి పాలు అమృత మునకు తుల్యమైన అనుపానమగును.

అశనరీతులు:— శరీర పరిస్థితి, అలవాటు, కాలభేదము ననుసరించి కొన్ని పదార్థాలు హిత మైనవి, మరికొన్ని అహితమైనవని విభజించ గలము.

ఒక పూట భోజనంలో హితమైనవి, అహిత మైనవి రెండును గూడ చేరి ఉంటే 'సమ శనము' అని పేరు.

ఒకమాటు భోజనం అయిన వెంటనే తిరిగి సందర్భ నిర్బంధములను బట్టి చేయబడు భోజ నానికి అధ్యశనమని పేరు.

అకాలంలో చేసే భోజనంగాని, అమితంగా చేసే భోజనంగాని, ఎక్కువ తక్కువగా చేసే భోజనంగాని విషమాశనం అంటారు.

ఈ మూడువిధాలైన అశనములు కూడ అహితమైనవి. ఈ చేయరానివి చేసినట్లయితే శీఘ్రకాలంలోనే రోగాలు, మరణము కలుగ వచ్చును.

సాధారణంగా మనం భుజించే ఆహారంలో చెత్త, రాళ్ళు, మన్ను, వెంట్రుకలు మొదలగునవి ఉంటే భుజించరాదు. వండి చల్లారినదానిని తిరిగి వేడిచేసి భుజించరాదు. కూరగాయలు, వరాన్నము, చిత్రాన్నములు ప్రధానమైన ఆహారాలుగ భుజించరాదు. ఎక్కువ వేడి వస్తువులుగాని, ఎక్కువ ఉప్పు చేరినవిగాని భుజించరాదు. ఇంతటితో ఆహార విషయం పూర్తయినది. ★